క్లుప్తంగా

మట్టి గణపతిని పూజిద్దాం..

పాలకొండ రూరల్: గణపతి ఉత్సవాల్లో మట్టి గణపతిని పూజించి, తద్వారా పర్యావరణాన్ని ప్రేమిద్దామని స్థానిక సిరి స్కూల్ విద్యార్థులు నినదించారు. పాఠశాల వేదికగా మట్టితో సిద్ధం చేసిన గణనాథుని విగ్రహాలను గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. పీఓపీతో చేసిన విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణం నాశనమవుతుందని చెబుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. కేఎల్ గ్రూప్, అమెజాన్ కంపెనీల్లో ప్యాకింగ్, అన్‌లోడింగ్ ఉద్యోగాలకు ఆసక్తి ఉన్న వారిని ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.16 వేలు నుంచి రూ.18 వేల వరకు వేతనం చెల్లించడం జరుగుతుందని, ఎంపికైన వారు చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 30 ఏళ్ల వయసు కన్నా తక్కువ వయసు, పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ప్రేమపూర్వకంగా మెలగాలన్నారు. జ్వర లక్షణాలతో వచ్చిన వారికి మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలని తెలిపారు. పాము, కుక్కకాటు వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. విధులను చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 120 మంది హాజరు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు 120 మంది నిరుద్యోగులు హాజరుకాగా.. 55 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. అమెజాన్ సంస్థలో ఉద్యోగాల కోసం కేఎల్ గ్రూపు ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు మాట్లాడుతూ .. ఇటువంటి జాబ్‌మేళాలను అభ్యర్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ గణేష్ పాల్గొన్నారు.

పెరుగుతున్న డెంగీ కేసులు

సీతంపేట: డెంగీ, మలేరియా కేసులు రోజు,రోజుకూ పెరుగుతున్నాయి. ఈ నెలలో ఇప్పటివరకు 18 కేసులు నమోదయ్యాయి. అలాగే మలేరియా పాజిటివ్ కేసులు కూడా ప్రతిరోజూ నమోదవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోయిన కేసులకు కూడా ఇటీవల ట్రీట్‌మెంట్ ఇచ్చామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

పాలకొండలో వర్షం ..

పాలకొండ రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా గురువారం రాత్రి వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో మరో రెండు రోజులు భారీ నుంచి సాధారణ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉంటాయన్న వాతావరణ శాఖ సూచనలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉన్న క్రమంలో నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ఫింగో ఎంటర్‌ప్రైజెస్ అన్ని రకాల వ్యాపార ప్రాజెక్టులను అందిస్తుంది వ్యక్తిగత, వ్యవసాయ, విద్య DMA స్వాగతం, జీతం+కమీషన్, ✆ 9266809540. [T-278]

WANTED

■ Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9502712418(Work from Home available) [G-9028]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663 [H-796273]

■ కష్టలేనీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 8317512135. [HA-98358]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





ఉత్తమ గురువులు వీరే...

పార్వతీపురం లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ గురువులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సత్కరించారు.

- పార్వతీపురం టౌన్





పాలకొండ: జూనియర్ కళాశాలలో గురువులను సన్మానిస్తున్న అధ్యాపకులు



భామిని: బత్తిలిలో రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



జియ్యమ్మవలస: అల్లువాడ ఎంపీపీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



గరుగుబిల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

ఆచార్య దేవోభవ!

గురువులకే గురువు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులంతా సర్వేపల్లి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడి, సమాజంలో గురువుకున్న సమున్నతమైన స్థానాన్ని వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు ఎప్పుడూ స్నేహితుడిగా, వేదాంతిగా, మార్గదర్శకుడిగా ఉంటూ విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి, ఎదుగుదలకు సహకరిస్తాడన్నారు. తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువుదేనని, చక్కని విద్యను ఓ వైపు అందిస్తూనే మరోవైపు మనల్ని గొప్ప సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించి, గురుభక్తిని చాటుకున్నారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలలో గురువుల గొప్పతనం వివరిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



వీరఘట్టం: ఎంఆర్‌సీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ ఆనందరావు



వీరఘట్టం: నడుకూరులో సహచర ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



వీరఘట్టం: తలవరం పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాలకొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఆయన నేత్రాలు సజీవం



మృతుడు కూర్మయ్య(ఫైల్)



కూర్మయ్య నేత్రాల నుంచి కార్నియాను సేకరిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామానికి చెందిన కల్లివిల్లి కూర్మయ్య(96) బుధవారం సాయంత్రం మృతి చెందారు. అయితే ఆయన తన నేత్రాల దానానికి సంబంధించి, 2016లోనే అంగీకారం తెలుపుతూ కుటుంబ సభ్యులను ఉద్దేశించి, లేఖ రాసి ఉంచారు. ఈ మేరకు తన తండ్రి కోరికను అర్థం చేసుకున్న కుమార్తెలు ఉమామహేశ్వరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మలు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(శ్రీకాకుళం) వారికి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది కూర్మయ్య కళ్లకు సంబంధించిన కార్నియాను సేకరించి, శ్రీకాకుళం తరలించారు.

వాటితో పూర్తి అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు చూపును ఇవ్వవచ్చని, ఆయన నేత్రాలు సజీవమని సిబ్బంది తెలిపి, దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి..

- డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడకుండా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ కె.విజయ పార్వతి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై డాక్టర్ ఎస్.రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.



ఎం.సింగుపురం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

వ్యవసాయ, ఉద్యాన పంటల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని వ్యవసాయ, ఉద్యాన పంటలను రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ.. ఏడీఏ నిర్మల జ్యోతితో కలిసి గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏ పంట ఏ మేర దెబ్బతిన్నదో అంచనా వేసే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం వరి పంటలో ఆకు ముడత పురుగు కనిపిస్తోందని, నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ ద్రావణం పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు 0.2 గ్రాముల 20 ఎస్‌పీ 20 పీఎస్ ఎసెటెంపరీడ్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. వారి వెంట కేవీకే శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో పత్తి పంట పరిస్థితిని పరిశీలిస్తున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ధ్రువ, తదితరులు

అవార్డుల ఎంపికలో సీనియర్లకు అన్యాయం

- యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం: ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో ప్రాథమిక, యూపీ పాఠశాలల సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని యూటీఎఫ్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పలువురు నాయకులు మీడియాతో మాట్లాడుతూ, ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తుందన్నారు. ఇందుకోసం ప్రతి మండలం నుంచి ఎంఈఓలు సిఫార్సు చేసిన పేర్లను పరిగణనలోకి తీసుకుని, అందులో నుంచి జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు ఇస్తుంటారని చెప్పారు. అయితే పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఎంఈఓలు ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లు బుట్టదాఖలయ్యాయని ఆరోపించారు. వీరఘట్టం మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లను సిఫార్సు చేస్తే వారికి బదులు వేరే వాళ్ల పేర్లు జాబితాల్లో ఉన్నాయన్నారు. మండల స్థాయిలోనైనా సీనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారులు సన్మానించక పోవడం సరికాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, ఎస్.రాజకుమారి, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు పి.ఎస్.లక్ష్మీసత్యకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని వీఆర్‌వోలంతా నదీతీర ప్రాంతాలకు ప్రజలను వెళ్లనివ్వకుండా చూడాలన్నారు. వర్షాల దృష్ట్యా సహాయక చర్యల కోసం తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపిఆర్‌డి ఎల్.గోపాలరావు తదితరులున్నారు.

● బకాయి వేతనాలు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లోని పారిశుధ్య సిబ్బంది(గ్రీన్ అంబాసిడర్ల)కి బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకులు పి.తిరుపతిరావు, కె.అవినాష్, ఎం.రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని ముఖద్వారం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలిసి గురువారం ఆందోళనకు దిగారు. ఏడాది నుంచి రెండేళ్ల వరకు వారి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

● నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. గురువారం స్థానిక పాలకొండ- విశాఖ రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడు, డ్రైవింగ్ లైసెన్సులు, ఓవర్‌స్పీడ్‌తో వచ్చేవారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

● నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లోఓల్టేజ్, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం.సింగుపురం, పొట్లిలి, బడ్డుమాసింగి, జంపరకోట, అవలంగి, తదితర గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జియ్యమ్మవలస: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస నాయుడు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

● చురుగ్గా పూడికతీతలు

పాలకొండ రూరల్ : విస్తారంగా వర్షాలు కురుస్తున్న క్రమంలో కాలువల్లో మురుగు పేరుకుపోకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు వాటపాగు సర్పంచ్ వి.రాజారావు అన్నారు. పంచాయతీ పరిధిలోని వీధి కాలువల్లో పేరుకున్న మురుగు, పూడికను యంత్రాల సహాయంతో గురువారం తీయించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సహకరించాలన్నారు.

● లబ్ధిదారులకు మరింత పౌష్టికాహారం

వీరఘట్టం: సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత పౌష్టికాహారం అందుతోందని సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. తలవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. ప్రతి నెలా కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం, 250 గ్రాములు బెల్లం, 250 గ్రాముల చిక్కీలు, 500 గ్రాముల నూనె, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, కిలో రాగిపిండి, తదితర సరుకులను సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా అందజేస్తున్నామన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

పాలకొండ: యువత రక్తదానానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గర్భాన సత్తిబాబు, గండి రామినాయుడు, శ్రీనివాసరావు, అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్, రక్తనిల్వల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



